క్లుప్తంగా

భోగాపురంలో భారీ వర్షం


భోగాపురం జాతీయ రహదారిపై చేరిన వర్షం నీరు

భోగాపురం: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పలు రహదారులు జల దిగ్బంధమయ్యాయి. ప్రధానంగా భోగాపురం జాతీయ రహదారిపై నీరు నిలవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలు

- కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ ఏజీఎం విజయశ్రీ

విజయనగరం అర్బన్: ఖాతాదారులకు మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలను అందించడానికి ప్రణాళికలు వేశామని, సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ ఏజీఎం ఎల్ఆర్ విజయశ్రీ అన్నారు. స్థానిక కెనరా బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఖాతాదారుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిత బ్యాంక్ ఫౌండర్ ఎ.సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ నూతనంగా రూపొందించిన సేవలు, రుణ విధానం తదితర సేవలను ఖాతాదారులు అవగాహన చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ శాఖల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

కళ్ల కలకలపై తస్మాత్..

విజయనగరం ఫోర్ట్: కళ్ల కలక వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ హోమియో వైద్యాధికారి డాక్టర్ జి.వర ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న హోమియో డిస్పెన్సరీలో కళ్ల కలక వ్యాధి రాకుండా ప్రివెంటీవ్ మందును రోగులకు మంగళవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లు ఎర్రబడడం, దురద, ఇసుక పోసినట్టు అనిపించడం, కంటి నుంచి విపరీతంగా నీరు కారడం కళ్ల కలకల లక్షణాలని తెలిపారు. కార్యక్రమంలో నేచురపతి వైద్యురాలు స్వప్న, ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుల సమావేశం

విజయనగరం పూల్‌బాగ్: సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా మంగళవారం స్థానిక వీటీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో గణితానికి సంబంధించి ఉపాధ్యాయులు సమావేశం జరిగింది. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్ఎస్‌వీఎస్ ఆర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో, రిసోర్స్‌పర్స‌న్‌లుగా ఎం.రమేష్‌చంద్ర వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా డైట్ లెక్చరర్స్ నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, డైట్ వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యాల నాయుడు పాల్గొని ఉపాధ్యాయులకు వివిధ సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మేలు


పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఏవో

విజయనగరం రూరల్: విత్తనశుద్ధితో పంటకు తెగుళ్ల బెడద తప్పుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు పేర్కొన్నారు. మండలంలోని గుంకలాం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనశుద్ధి, నారుమడి యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ పాక్షికం


బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి ఎన్. నాగభూషణం, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఎం.భానుప్రకాశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. కోట జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు నాణ్యమైన భోజనం లేక, సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 53 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో స్కూల్స్ మూతపడ్డాయని 3, 4, 5 తరగతుల విలీనం వలన విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు గౌరీశంకర్, శ్రావణ్‌కుమార్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కె.బాలకృష్ణ, ఎం.వాసు, పికెఎల్.రాజు, దుర్గాప్రసాద్, కె.గౌరీ, గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.

గడప గడపలో గర్వంగా తిరుగుతున్నాం...

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- నవరత్నాలతో ఇంటింటా వెలుగులు
- మల్యాడ, వెంకన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


మల్యాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో గడప గడపలో గర్వంగా తిరుగుతున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ... నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఏ గడపకు వెళ్లినా చిరు నవ్వులతో ప్రజలు తమని ఆహ్వానిస్తున్నారని.. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి : ఎమ్మెల్సీ పెనుమత్స

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ వలంటీర్ల ద్వారా జగనన్న అవినీతి రహిత, మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు తమకి ప్రభుత్వ పథకాలు అందలేదని చెప్పేందుకు ఆస్కారం లేదన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పలు సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, సర్పంచ్ పప్పల నారాయణమ్మ, తహసీల్దార్ రమణరాజు, ఎంపీడీవో గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ ఓ నూతన అధ్యాయం


నెల్లిమర్ల రూరల్: మల్యాడలో ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఓ నూతన అధ్యాయమని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. దీన్ని ప్రజలు కూడా సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజవర్గాల్లో పలుచోట్ల మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


డెంకాడ: పినతాడివాడలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు


భోగాపురం: లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు


విజయనగరం రూరల్: బియ్యాలపేటలో లబ్ధిదారునికి ధ్రువపత్రాలు అందజేత


పూసపాటిరేగ: చౌడువాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో రామారావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు

ప్రజలు మెచ్చిన నాయకుడు సీఎం జగన్


48వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్ 59వ సచివాలయం పరిధిలోని సాలివీధి, అగురు వీధి ప్రాంతాల్లో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలు తెలియజేయాలని కోరారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వాటిపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, పీఏసీఎస్ అధ్యక్షుడు వేణు, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 31వ డివిజన్ 37, 38 సచివాలయాల పరిధిలో గాయత్రీ నగర్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల కృష్ణారావు, కార్పొరేటర్ లక్ష్మణరావు, పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లిన నాయకులకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జిలు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగుల సీట్లుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 4 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 60 మిగులు సీట్లకు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుల, ఆదాయ, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

నేడు సీతారామునిపేటలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామంలో బుధవారం గడప గడపకు కార్యక్రమం జరగనుందని ఎంపీడీవో గిరిబాల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ముందుగా గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

డీవైఎఫ్ఐ ఆందోళన

విజయనగరం అర్బన్: జిల్లాలోని పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. తొలిత పట్టణంలోని కోట జంక్షన్ నుండి కన్యకా పరమేశ్వరి కోవెల మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూతపడిన జూట్ మిల్లులు, ఫెర్రో పరిశ్రమలు, షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రుద్రప్రసాద్, కార్యదర్శి సీహెచ్ హరీష్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సీహెచ్‌రామకృష్ణ, జగదీష్, హర్ష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పురస్కారాలకు ఎంపిక

విజయనగరం టౌన్: మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కర్షకులు, కార్మికుల సేవలను, ప్రతిభను గుర్తించి వారికి సేవాభారతి, తెలుగు తేజం జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేసేందుకు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులను ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబరును సంప్రదించాలని కోరారు.

బాలికలు చక్కగా చదువుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పారావు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

విజయనగరం ఫోర్ట్: బాలికలు మంచిగా చదువుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక కేజీబీవీలో బాలల హక్కుల పరిరక్షణ, బాలల చట్టాలపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. మోసపూరిత మాటలకు మోస పోవద్దన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను లక్ష్యంగా పెట్టుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని చెప్పారు. ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బాలికలకు తరుచుగా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, తవిటినాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాతకుమారి పాల్గొన్నారు.

‘గడప గడప’లో గుర్తించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని నగర డిప్యూటీ మేయర్ ముచ్చుల యాదవ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 24వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చుల యాదవ్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి సమస్యలకు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి క్రాంతి కుమార్, నాయకులు పాండురంగారావు, లీలా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జన్‌బాగిదారి కార్యక్రమాలు ప్రారంభం

విజయనగరం పూల్‌బాగ్: కేంద్రీయ విద్యాలయంలో పీఎంశ్రీ స్కూల్ జన్‌బాగిదారి కార్యక్రమాలు ఈ నెల 25నుంచి 28 వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.కోటి నిధులు పీఎంశ్రీ స్కూల్ పథకం ద్వారా త్వరలో విద్యాలయ రీసీవ్ చేసుకుంటుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద గవర్నమెంట్ నుండి ఎయిడ్ వస్తుందని ఆ ఎయిడ్ విద్యాలయ ఉన్నతికి ఉపయోగిస్తామని తెలిపారు.

రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- బీసీ కాలనీలో శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగర అభివృద్ధి అభిమతంగా చేపడుతున్న శంకుస్థాపన మాసోత్సవాలు పండుగ వాతావరణంలో సాగుతున్నాయి. నగరంలోని 37వ డివిజన్ పరిధి బీసీ కాలనీలో రూ.24.75 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి బీసీ కాలనీలో నేడు సాధ్యమైందన్నారు. 2024 ఎన్నికలు వచ్చే సమయానికి ఈ డివిజన్లో మౌలిక సదుపాయాల లేమి అనే మాటే ఉండకుండా చేస్తానని గతంలో శాసనసభ్యులు కోలగట్ల హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇక్కడ తాగునీరు, రహదారులు, కాలువలు వంటి సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రహదారులు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. నగరంలో పూర్తి స్థాయి అభివృద్ధి కోలగట్లతోనే సాధ్యమైందన్నారు. నగర మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితాకు సహకరించాలి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్‌వో సూర్యనారాయణ

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ

విజయనగరం రూరల్: కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల సహకారం అవసరమమని విజయనగరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్‌వీ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలోని తప్పులు, సవరణ తదితర అంశాలపై వచ్చే నెల 21 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటికి వచ్చే బీఎల్‌వోలకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ సంజీవ్, సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, ఈవోపీఆర్డీ డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత


చెక్ అందజేస్తున్న వంశీకృష్ణ, తదితరులు

చీపురుపల్లి: మండలంలోని రావివలస పంచాయతీ పరిధి నాగంపేట గ్రామానికి చెందిన యువకుడు కొమ్ము సీతారాం శేఖర్‌కు రూ.1.40 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ మంగళవారం అందజేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలను సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఎంతగానో ఆదుకుంటోందని అన్నారు. రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, నాయకులు కొమ్ము చిరంజీవి, పనస వెంకట్, కొమ్ము దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం


రాము కుటుంబానికి నగదు అందజేస్తున్న అతని మిత్రులు

చీపురుపల్లిరూరల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని గచ్చలవలస గ్రామానికి చెందిన యువకుడు రొంగలి రాముకు గరివిడి మండలం బొండపల్లి గ్రామ యువత, పెద్దలు మంగళవారం రూ. 55వేల ఆర్థిక సాయం చేశారు. బాధితుడు రాము ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రైవేటు ఉద్యోగం లో చేరారు. మోకాళ్ల నొప్పితో మూడు నెలల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా రెండుసార్లు సర్జరీ చేశారు. మోకాలు వాపు పెరగడంతో వైద్యుల సూచనలతో వైజాగ్‌లోని మహాత్మగాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌ను సంప్రదించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రాముతో కలిసి చదువుకున్న బొండపల్లి గ్రామానికి చెందిన స్నేహితులకు తెలియడంతో సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. తమతో పాటు గ్రామస్తుల నుంచి సేకరించిన రూ. 55,500 నగదును రాము కుటుంబ సభ్యులకు అందజేశారు. రామును ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.